క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాకాల: మండల కేంద్రంలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పాకాల, పులిచెర్ల మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈఈ నరేంద్ర తెలిపారు. శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని కోరారు.

16 నుంచి మిల్లెట్స్ దినోత్సవాలు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఈ నెల 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు ప్రపంచ మిల్లెట్స్ దినోత్సవాలను జరపనున్నట్లు వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మశ్రీ అవార్డు గ్రహీతలు, స్విమ్స్ డైరెక్టర్ తదితర ప్రముఖులతో మిల్లెట్స్‌తో కలిగే ప్రయోజనాల పై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

రుయా సూపరింటెండెంట్‌కు వినతి

తిరుపతి తుడా: రుయాలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు ముందు మొరపెట్టుకున్నారు. ఏఐటీయూసీ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన్ను కలిశారు. వేతనాల చెల్లింపుల్లో భారీ కోతలు విధిస్తున్నారని వాపోయారు. ప్రశ్నిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తాం అంటూ కాంట్రాక్టర్ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.16వేలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాక్రిష్ణ, యూనియన్ నాయకులు మహేంద్ర, రవి, సుబ్రమణ్యం, పార్వతి పాల్గొన్నారు.

పలువురికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుమలలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం, తదితర నేరాలకు పాల్పడిన పలువురికి రూ.4,800 జరిమానా విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పల్లపోలు కోటేశ్వరరావు శుక్రవారం తిరుమల క్యాంపు కోర్టులో తీర్పు చెప్పారు. తిరుమల వన్ టౌన్, ట్రాఫిక్ పోలీసులు నేరాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు.

తిరుపతి అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకోం


బీజేపీకి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

తిరుపతి కల్చరల్: తిరుపతి నగర అభివృద్ధిని అడ్డుకుంటున్న బీజేపీ నేతలను వ్యతిరేకించాలని వామపక్ష పార్టీల నేతలు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఐ నేత ఆర్.హరికృష్ణ మాట్లాడుతూ.. తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధుల నుంచి ఒక శాతం కేటాయిస్తూ టీటీడీ మంచి నిర్ణయం తీసుకుంటే జీర్ణించుకోలేని బీజేపీ నేతలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నగరం పరిశుభ్రంగా ఉంటేనే యాత్రికులు సంతోషంగా తిరుమలకి వెళ్లి స్వామివారిని దర్శించుకోగలరన్నారు.

బస్సు టైర్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

తిరుపతి అర్బన్: బస్సు టైర్లు సక్రమంగా లేకపోవడం వల్ల పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీపీటీఓ చెంగల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన చాంబర్‌లో టైర్ల పక్షోత్సవాల్లో భాగంగా మెకానిక్స్, సూపర్‌వైజర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. చిన్నపాటి సమస్యలున్నా కొత్త టైర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధానంగా తిరుమలకు నడుపుతున్న అన్ని సర్వీసులకు టైర్లు ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలన్నారు. కొత్త విడిభాగాలను అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

పీసీసీ ప్రధాన కార్యదర్శి నియామకం

తిరుపతి అర్బన్: తిరుపతికి చెందిన చిట్టిబాబును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ శుక్రవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే తిరుపతి నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా యార్లపల్లి గోపిని నియమించారు.

రక్తదాన శిబిరానికి స్పందన

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి విశేష స్పందన లభించింది. కళాశాల ప్రాంగణంలో ఉయ్ ఆర్ విత్ యూ చారిటబుల్ ట్రస్ట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశాయి. 210 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ప్రిన్సిపల్ సుధాకర రెడ్డి, రుయా బ్లడ్ బ్యాంక్ అధికారి హరిత పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి జగనన్న భరోసా

• నగర మేయర్ శిరీష

తిరుపతి తుడా: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్యానికి జగనన్న భరోసా ఇస్తున్నారని తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. నగరంలోని తాతానగర్, అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన సురక్ష క్యాంప్‌లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్‌లలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వారికి టోకెన్ ఇచ్చి, శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. శుక్రవారం సుమారు 1250 మంది వైద్య పరీక్షలు చేసుకున్నారని చెప్పారు. వీరందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ కేఎల్ వర్మ, ఆరోగ్య అధికారి అన్వేష్ రెడ్డి, సూపరింటెండెంట్ రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


తిరుపతిలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ శిరీష, అధికారులు

పేదలకు మెరుగైన వైద్య సేవలు

చంద్రగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని మిట్టపాళెం పంచాయతీలో సురక్ష క్యాంపు ఏర్పాటు చేశారు. వైద్య సేవలు పొందేందుకు వచ్చిన సుమారు 400 మందికి ఉదయం, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించారు. వైద్య సేవలను ఎంపీడీఓ రమేష్‌బాబు, తహసీల్దార్ శిరీషతో కలిసి శిబిరాన్ని పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ ద్వారా లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత దివంగత సీఎం వైఎస్సార్, ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌లకే దక్కుతుందన్నారు. కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను అందించడంతో పాటు గుండె, లివర్, నరాలు ఇతరాత్ర వ్యాధులను గుర్తించి వారికి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్య సేవలను అందించడమే ఈ క్యాంపు ముఖ్య ఉద్దేశమన్నారు. వ్యాధి ఉన్న వారిని గుర్తించి ప్రతి నెలా ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. కంటిచూపు మందగించిన వారికి పరీక్షలు నిర్వహించి, వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా ఉచితంగా కళ్లజోడ్లను ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఉప సర్పంచ్ వేణుగోపాల్ రెడ్డి, సెక్రటరీ అనురాధ, మాజీ సర్పంచ్ బాల సుబ్రమణ్యం, ఐసీడీసీ సూపర్‌వైజర్లు నాగమణి, సుహాసిని పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి రక్ష

భాకరాపేట: ప్రజల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష వరం అని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చట్టేవారిపాళెం సచివాలయం వద్ద గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దేవేంద్రబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు స్వరూప, సర్పంచ్ ధనలక్ష్మి, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


చంద్రగిరి: వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ


భాకరాపేటలో..

పలువురికి మోహిత్‌రెడ్డి పరామర్శ

తిరుపతి రూరల్/పాకాల: తిరుపతి రూరల్ మండలం మల్లంగుంటకు చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆరణి సురేంద్ర రెడ్డి తల్లి ఆరణి నిర్మలమ్మ (66) అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం మోహిత్ రెడ్డి ఆమె పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. సురేంద్ర రెడ్డికి ధైర్యం చెప్పారు. అలాగే పాకాల మండలం ఉప్పరపల్లి పంచాయతీ ఊట్లవారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ భాను తండ్రి మునిరత్నం(66) మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి, ఉపసర్పంచ్ జయచంద్రారెడ్డి, ఎంపీటీసీలు హేమాద్రి, సురేష్, మునిరత్నంరెడ్డి, బాబురెడ్డి, భాస్కర్‌నాయుడు, చలపతిరాజు ఉన్నారు.


నిర్మలమ్మకు నివాళులర్పిస్తున్న తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

డిసెంబర్ నాటికి అందుబాటులోకి రహదారులు

• డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో చేపట్టిన రహదారుల నిర్మాణాలు డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం చెన్నారెడ్డి కాలనీ–హరేరామ హరే క్రిష్ణ రోడ్డు, తిలక్ రోడ్డు–గంగమ్మ ఆలయ రోడ్లను కలుపుతూ నిర్మిస్తున్న లింక్ రోడ్ల అభివృద్ధి పనులను అధికారులు, స్థానిక పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అనేక కనెక్టివిటీ, ఫ్రీలెఫ్టులు, రోడ్ల విస్తరణ పనులు చేపట్టామన్నారు. తొలి ప్రాధాన్యతగా 18 మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 10మాస్టర్ ప్లాన్‌రోడ్లు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. మరిన్ని రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచించామన్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు పాటించాలని చెప్పారు. అనుకున్న సమయానికి పనులు పూర్తి చేయించాల్సిన బాధ్యత ఇంజినీర్లదేనన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, డీఈ శ్రావణి, టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్ తొండమనాటి వెంకటేష్, నాయకులు ఉదయ్‌వంశీ, జీవరత్నం, బొగ్గుల వెంకటేశ్వర్లు, అరుణ కుమార్, శ్యామల ఉన్నారు.


అధికారులతో కలిసి చెన్నారెడ్డి కాలనీ–ఇస్కాన్ లింక్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న అభినయ్‌రెడ్డి

అవగాహనతోనే బ్రెస్ట్ క్యాన్సర్ దూరం

• స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా: నాలుగు పదుల వయస్సు దాటితే బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ తప్పనిసరి అని స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్ అన్నారు. స్విమ్స్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తించడం వల్ల మందులతోనే నయం చేసుకోవచ్చన్నారు. ఏటా అక్టోబర్ నెలను క్యాన్సర్ అవగాహన నెలగా గుర్తించారని తెలిపారు. దీని లక్ష్యం బ్రెస్ట్ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించడం, స్క్రీనింగ్ ప్రాముఖ్యతను తెలియజేసి రోగులకు మద్దతుగా నిలబడి వారికి మనోధైర్యం కల్పించడమని వెల్లడించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాదిని నో వన్ షుడ్ ఫేస్ బ్రెస్ట్ క్యాన్సర్ అలోన్‌గా ప్రకటించారని చెప్పారు. కార్యక్రమంలో అంకాలజీ విభాగాధిపతి భార్గవి, అద్వైత్, రవితేజ, ఆదిత్య, కీర్తన, మౌర్యరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ నర్సింగ్ ప్రభావతి, ఏడీ రాజశేఖర్ పాల్గొన్నారు.


పింక్ బెలూన్స్‌ను ఆవిష్కరిస్తున్న స్విమ్స్ డైరెక్టర్, వైద్యులు

పంచాయతీ సిబ్బందిపై డీపీఓ ఆగ్రహం

చంద్రగిరి: మండల పరిధిలోని ఏ.రంగంపేట పంచాయతీ కార్యాలయాన్ని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి ఆదెం రాజశేఖర్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు సౌకర్యాలు కల్పించడం లేదని ఫిర్యాదులు రావడంతో కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వసభ్య సమావేశం నిర్వహించకుండానే వార్డు సభ్యుల ఇళ్లకు వెళ్లి సంతకాలు సేకరిస్తున్నట్లు ఆయన దృష్టికి వెళ్లింది.

దీంతో పంచాయతీ అధికారులపై డీపీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పనిసరిగా మూడు నెలలకు ఒకసారి సర్పంచ్ అధ్యక్షతన స్థానిక ఎంపీటీసీ, ఉప సర్పంచ్, వార్డు సభ్యులతో పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వీధి దీపాలు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తాగునీరు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మేజర్ పంచాయతీ కావడంతో అభివృద్ధికి ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.


రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ రాజశేఖర్ రెడ్డి

రామీ గెస్ట్‌లైన్ చైర్మన్ జన్మదినం


అన్నదానం చేస్తున్న ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: రామీ గెస్ట్‌లైన్ హోటల్ చైర్మన్ రాజిశెట్టి జన్మదినాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో ఆ గ్రూప్ కార్యాలయాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు. తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రక్తదానం, అన్నదానం చేశారు. అనంతరం రామీ గెస్ట్‌లైన్ హోటల్ అండ్ అకాడమీ సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి రాజిశెట్టి పుట్టిన రోజు వేడుకలను ఆ హోటల్‌లో జరుపుకున్నారు. సుదీర్ఘ సేవలందించిన సిబ్బందికి జ్ఞాపికలు అందించారు. వచ్చే ఏడాదిలో దేశంలోని తమ సంస్థల్లో వెయ్యికి పైగా ఉద్యోగాలు కల్పిస్తామని ఆయన సందేశం పంపారు. హెచ్‌సీ రావల్, వంశీ కిరణ్, జీఎం అడ్మిన్ జి.భానుప్రకాష్, అకాడమీ వైస్ ప్రిన్సిపల్ మహేశ్వరి పాల్గొన్నారు.

చలో గుంటూరును జయప్రదం చేయండి

తిరుపతి కల్చరల్: నూర్‌బాషా, దూదేకుల ముస్లిం జనాభా దామాషా ప్రకారం మైనారిటీ రిజర్వేషన్లే లక్ష్యంగా ఈనెల 29న తలపెట్టిన చలో గుంటూరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డి.మస్తానమ్మ కోరారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కరముల్లవలి, నాయకులు షరీఫ్, రెడ్డిబాషా, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యోగా జట్టుకు అనుప్పల్లి విద్యార్థులు

రామచంద్రాపురం: మండలంలోని అనుప్పల్లి ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జిల్లా యోగా జట్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం హరికుమార్, పీడీ సురేష్ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. శ్రీకాళహస్తి వేదికగా జరిగిన చిత్తూరు జిల్లా యోగా సెలక్షన్స్ అండర్–17 విభాగంలో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు శశికళ, సంజన, అండర్–14 విభాగంలో యువరాణి, దివ్యశ్రీ ఎంపికైట్లు చెప్పారు. ఈ నెల 28న పశ్చిమగోదావరి జిల్లా వీరవసరంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఈవీఎంల తనిఖీకి పటిష్ట భద్రత

• 20 రోజులపాటు కార్యక్రమం

తిరుపతి అర్బన్: రాష్ట్రంలో ఈ నెల 16వ తేది నుంచి 20 రోజుల పాటు ఈవీఎంల తొలి విడత తనిఖీకి సంబంధించి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. అమరావతి నుంచి ఆయన శుక్రవారం వర్చువల్ పద్ధతిలో జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా నుంచి డీఆర్వో పెంచలకిషోర్, ఎన్నికల డీటీ సురేష్ బాబు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి ఈవీఎంల తొలి విడత తనిఖీ కార్యక్రమంలో భాగంగా విధులు కేటాయించిన వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం 20 రోజుల పాటు రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా డీఆర్వో పెంచలకిషోర్ మాట్లాడుతూ ఈవీఎంల తొలి విడత తనిఖీ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లలో భాగంగా పోలీస్ సెక్యూరిటీ, వెబ్ క్యాస్టింగ్, సీసీ టీవీలు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు రోజు ఒకరిని మాత్రమే తొలి విడత తనిఖీకి అనుమతిస్తామని చెప్పారు. తనిఖీ కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించమని స్పష్టం చేశారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో పెంచలకిషోర్

శ్రీ చైతన్య స్కూల్లో దసరా ఉత్సవాలు

తిరుపతి ఎడ్యుకేషన్: స్థానిక బైరాగి పట్టెడలోని శ్రీ చైతన్య స్కూల్ ఐపీఎల్ బ్రాంచ్‌లో శుక్రవారం దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు దేవీ అమ్మవార్ల వేషధారణలో ఆకట్టుకున్నారు. కుల, మత భేదం లేకుండా పిల్లల్లో అన్ని రకాల పండుగ ప్రాముఖ్యతను తెలియజెప్పడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ప్రిన్సిపల్ అన్నపూర్ణ చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏజీఎం సురేష్ విచ్చేసి పిల్లలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రవిబాబు, వైస్ ప్రిన్సిపల్ సందీప్ శ్రీనివాస్, డీన్ శివరాజు, ఐపీఎల్ ఇన్‌చార్జ్, సీబ్యాచ్ ఇన్‌చార్జ్, సివిల్స్ ఇన్‌చార్జ్, ప్రైమరీ ఇన్‌చార్జ్, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పిల్లలు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


అమ్మవారి వేషధారణలో విద్యార్థినులు

నోరు అదుపులో పెట్టుకోకుంటే బుద్ధి చెబుతాం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తిరుపతి కల్చరల్: జనసేన నేత కిరణ్ రాయల్ అర్హత మరిచి మంత్రులు, ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజయ్ కుమార్, టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ వాసుయాదవ్, పద్మజ, పసుపులేటి సురేష్ హెచ్చరించారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. కేవలం ఉనికి చాటుకోవడం కోసమే జనసేన నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని.. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతామన్నారు. దొంగ, 420 కేసులున్న కిరణ్ రాయల్ తన స్థాయిని మరిచి ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం సిగ్గుమాలిన చర్య అన్నారు. తిరుమల టౌన్ బ్యాంక్ అధికారి భార్య మోసం చేసి ఆస్తులన్నీ రాయించుకున్న వ్యక్తి నువ్వు కాదా అని ప్రశ్నించారు. చీప్ ట్రిక్స్‌తో ఎదగాలని చూస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారన్నారు.

సమస్యలపై వినతి

తిరుపతి కల్చరల్: తమ సమస్యలను పరిష్కరించాలని టీటీడీ అటవీ విభాగం సిబ్బంది వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం అలిపిరి బాలాజీ లింక్ బస్టాండ్ వద్ద ఫారెస్ట్ కార్మికుల జనరల్‌బాడి సమావేశం నిర్వహించారు. పెండింగ్ వేతనాలు, ఉద్యోగుల క్రమబద్ధీకరణ తదితర సమస్యలను టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని గౌతమ్‌రెడ్డి తెలిపారు. సంఘం నాయకులు ఎస్.రాజారెడ్డి, ఉపేంద్ర, షేక్ మహ్మద్ రఫీ, ఈశ్వర్‌రెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

తిరుపతి కల్చరల్: స్థానిక కొత్తవీధిలో వెలసిన శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈనెల 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ పామిడి సత్యనారాయణ, కార్యదర్శి దిండుకుర్తి నరసింహులు తెలిపారు. శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. అమ్మవారు తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారని తెలిపారు. ఈనెల 20వ తేదీ శ్రీసరస్వతీదేవి అలంకరణ నేపథ్యంలో బాసర నుంచి తెప్పించిన కంకణాలను విద్యార్థులకు ఉచితంగా అందజేయనున్నట్లు చెప్పారు. ఉత్సవాల చివరి రోజైన 23వ తేదీ అమ్మవారి ఊరేగింపు వేడుకగా చేపడతామన్నారు. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్వహించిన పార్వేటి ఉత్సవాన్ని ఈ ఏడాది తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆలయ పాలక మండలి కన్వీనర్లు కొండూరి మహేష్, శ్రీధర్, మదుసూధన్‌రావు, రవిచంద్రశేఖర్, సురేష్, లక్ష్మణ్, సుబ్బారావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆలయ కార్యదర్శి నరసింహులు, కమిటీ సభ్యులు